# వీణా తంత్రులు

పచ్చని పంటచేల పయిపయిగ పరువులెత్తే పైరుగాలి, ప్రక్కనే చరవన్ని పురవళ్ళుత్రొక్కి ప్రవహించే పెన్నపై తేలిపోతోంది. పంటచేల ప్రక్కనేపడి, ఓ నడివయసుకాడు, పెన్నఒడ్డుకు జేరాడు. పెన్నానది గాంభీర్య తరంగ మృదంగాలు విని, వయసుకాడు అలా ఒడ్డునేగెంతి పరువులెత్తాడు. —అది ఉదయకిరణాలతో, నిశీధిని ముడిపెట్టే ప్రశాంత సాయంసంధ్య.

దూరాన ఓ స్త్రీమూర్తి— వీణాపాణి—ఆశీనురాలై వుంది. ఆమె మీటే మీటుల స్వరాలు పెన్న స్రవంతులతోకలసి ప్రవహిస్తున్నాయి. వయసుకాడు స్త్రీచెంతకుజేరి చతికిలబడ్డాడు.

ఎంతో తగ్గుస్థాయిలో ఆమెపాడేపాట అతని హృదయతంత్రులపై స్పందనం గలిగించి, పంచేంద్రియాలకు గిలిగింతలు పెట్టింది.

పెన్నానది ప్రశాంతంగా ప్రవహించిపోతోంది. వీణాగానంలా. ఆ ప్రవాహంలో దూరదూరాన్నుంచి ఓ పడవగాడిపాట క్రమక్రమంగా ముందుముందుకు వినవస్తోంది.

"ఎవ్వా" కంఠం ఆవేదనతో ఆర్తిగా పలికింది.

"ఎవరు" కోకిలలు కుహూకుహూపాడున్నాయి.

'బాటసారిని' సమాధాన మొచ్చింది.

"ఇక్కడ చతికిలబడ్డావేం' హృదయ మడిగింది.

'ప్రకృతి ప్రశాంతంగావుంది" మనసు పలికింది.

"అయితే" సంశయం మేల్కొంది.

'పాట వినాలనిపించింది' అనుభూతి సుషుప్తి పొందింది.

ఆమె హృదయం మాతృత్వం వహించింది. వీణాస్వరాలు సర్వవేదనలూ మరుచునట్లు ఆగక చంద్రిక నాస్వాదించి దివ్యత్వము పొందినవి. వయసుకాడి హృదయము పూర్ణిమకళలై ప్రవాహములై ఉప్పొంగి ప్రవహించినవి. సర్వమూ మరచినాడు. ఆశక్తి ప్రవాహములు ప్రవహించి ప్రవహించి, ఒక పవిత్ర క్షేత్రమున, వేరొక దివ్యక్షేత్రము నుండి ప్రవహించివచ్చిన ప్రేమశక్తితో సంగమమై పోయినవి.

వయసుకాడి అనుభూతులు, ఆనందంతో విలీనమయ్యాయి. బాహ్యస్మృతిని పొందాడు.

"అమ్మా మీరెవరో మిమ్మల్ని చూచిన తక్షణమే నాహృదయం మీకంకితమైపోయింది. సర్వవేదనలూ మరువగలిగేను.

"ఎవరో నీవు నిన్ను చూడలేకపోయినాగూడా, నా హృదయంలో నీమాటలు బాధగా ప్రతిధ్వనిస్తున్నాయి.

"అవును అందుకే అప్పుడప్పుడు ఆశ్చర్యపడతూవుంటాను. కొన్ని హృదయాలు, ఏదోవిధంగా ఎప్పుడో ఒకప్పుడు, ఏదోఒక సంఘటనలో కనుచూపులోనే ఏకమైపోతాయి. అప్పటినుంచీ వారి జీవితాలు, దృక్పథాలూ, మార్గాలుగూడా మారిపోతాయి."

"నిన్ను చూడలేనందుకు యథార్థంగా ఎంతైనా బాధపడుతున్నాను. కాని హృదయంలో నిన్నో పుత్రునిలా భావనచేసుకొంటున్నా."

"అదృష్టవంతుణ్ణి అమ్మా"

దూరంగా ఓ పడవ, యతీశ్వరుల్ని ఒడ్డుకు జేర్చి తిరిగి ప్రయాణం సాగించింది పాటపాడుకొంటూ. ఋషీశ్వరులు పెన్నఒడ్డునే, స్త్రీమూర్తికి అభిముఖంగా దేవీస్తోత్రం చేస్తూ ముందుకు సాగుతారు. ప్రశాంత ప్రకృతిలో శ్లోకకంఠం కంచులా మ్రోగింది. క్రమక్రమంగా దరిజేరుతోంది.

ప్రకృతిలో మాటలు స్తంభించిపోయాయి.

అప్రయత్నంగా వీణమీటులువిజృంభించినాయి. ఋషీశ్వరుల శ్లోకకంఠం దరిజేరింది. ఉభయ స్వరాన్నుంచి స్థాయీభావంపొందింది.

ఋషీశ్వరు లన్నారు —

"అమ్మా ఎవరునీవు ? నీవేనా నాశ్లోకాన్ని వీణపై మీటావు!"

"మహాత్మా! అంధురాలిని, పంటకాపలాదారుని తల్లిని."

"వీణ ఎంతచక్కగా వాయించావు".

"వయసులో మేమూ వున్నవారమే."

"అంతేనమ్మా! ఆస్థులు వయసులు శాశ్వతంకాదమ్మా! మనసు నిర్మలం చేసుకోవాలిగానీ"

స్త్రీమూర్తి మాటాడలేదు.

వయసుగాడు పలికాడు.

"మహాత్మా నేనొక బాటసారిని. నాకూ 'నా' అనేవారెవరూలేరు. ఈలోకం విచిత్రమైందిగా కనుపిస్తోంది నాకు, ప్రకృతిమాతకు భూషణాలు అలంకరిస్తున్న యీమాతృమూర్తిని చూచి యింక యీశారీరక వాంఛలు వదులుకున్నాను.'

"ఇంతనడివయసులో జ్ఞానోదయం పొందటానికి పూర్వజన్మసంస్కారం కావాలి."

మహాత్మా ఇందాక ఆపడవగాడిపాట విన్నారుగదా! ఎంత బాగుంది!

"అవును నాయనా, నాకూ నచ్చింది. హిందూసాంప్రదాయాలు, మతవిషయాలలోనే యిలాంటి విశిష్టతవుంది. నిస్వార్థులయిన ఋషీశ్వరుల భావాలు పామరులకుకూడా బోధపడగలవు. అవే యీపాటలుగాగూడా రూపొందాయి. నట్టనడిపడిలో జీవితనౌక ఆవలిఒడ్డుకు జేరాలట' అదేకదూ వారిపాట! చక్కగా ఉపమానంగూడ సరిపోయింది. వెంటనే మిమ్మల్ని చూడాలని గాను."

"మహాత్మా మీరు ఎక్కడకు బయలుదేరార".

"భగవతేచ్ఛ."

"అయితే నన్నూ తీసుకుపోండి మహాత్మా'.

"సాంసారికసుఖం అనుభవించాలి. గృహస్థాశ్రమం పూర్తికావాలిగదా!"

"మహాత్మా ఆలోచనలో దిగాలనే వాంఛనాకు లేదు. చక్కని నిర్మలగంగా ప్రవాహం జ్యోతిర్మయంగా దర్శనమిస్తోంది."

"సరె నాయనా! నీహృదయాన్ని ఎందుకు కాదనాలి." నిశ్శబ్దం ఒక్కనిముషం అనిర్వచనీయంగా లాస్యం చేసింది.

స్త్రీమూర్తి పలికింది.

"బాబూ ఒక్కక్షణం నిన్ను కలుసుకుమాట్లాడాను. అయినా నిన్ను తలుచుకొంటే బాధ కలుగుతోంది. ప్రపంచమంతా యింత ప్రేమబా[illegible]ష్టమా ?"

"అదే కలుగుతే ప్రపంచమే ముందమ్మా. ద్వైతాద్వైతాలుసమైపోవచ్చును. ఆభావనలోనే ఋషులొక్క బ్రహ్మసాక్షాత్కారం కలుగుతుందంటార"

ఋషీశ్వరులు వయసుగాడివంక తిరిగారు.

"అంతేగాదునాయనా, తన హృదయాన్ని తాను అర్థంచేసుకుని ఇతరుల హృదయాన్ని తన హృదయంతో తుల్యంగా భావించుకోవాలి."

"మహాత్మా జ్ఞానోదయం కలుగజేశారు. దీక్ష నివ్వండి."

"కొంతకాలం గడచిపోవాలి. ఆద్యంతరంలేకపోతే నాతోరాగలవా ?".

"మహాప్రసాదం మహాత్మా."

స్త్రీమూర్తి అంతా విన్నది. బాధపడింది. రుద్ధ కంఠంతో పలికింది.

"స్వామీ యిలాంటివారు లోకానికుపయోగిస్తారు. ఇదిగో యిప్పుడే వచ్చాడు నాకుమారుడు. ఒట్టి పిచ్చివాడు. వీడొకస్నేహితుణ్ణి పట్టాడు. హృదయమిచ్చాడు. ప్రాణమైనా యివ్వగలడు. అయినా ఆస్నేహితుని తప్పుగూడా ఏమీలేదు. వీడు అనవసరంగా వాడిని తలుచుకొని కుమిలిపోతావుంటాడు. కొన్ని సమయాల్లో కంటనీరుగూడా పెట్టుకుంటాడు. హృదయాన్ని దిటవచేసుకోలేని బలహీనుడు. ఆశీర్వదించండి."

ఆబాలుడు ఋషీశ్వరులకు నమస్కరించాడు. ఋషీశ్వరులు ఆశీర్వదించారు. వయసుకాడు ఆస్త్రీమూర్తికి దోయిలించి ప్రణామం చేశాడు. బాధగాలేవదీసి హృదయానికి హత్తుకుంది.

ఋషీశ్వరులు వయసుకాడితో పైన ఒడ్డునే దూరదూరంగా నడిచిపోయారు. పెన్నానది ప్రశాంత ప్రవాహ తరంగాలూ, పైరుగాలి నినాదాలూ వీణమీటులపై బాధగా, లయగా, విశాల విశ్వతంత్రీస్పందనం కలిగించాయి.

"శివమల్లిక్"